# పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్రం

## సంచాలకుల వారి ఉత్తర్వులు

**సమర్పణ : జి. కిషన్, ఐ.ఎ.ఎస్.**

**ఉత్తర్వు సంఖ్య: 405/D/C&T/TSCERT/2015** **తేది: 27.06.2016**

**విషయం:** పాఠశాల విద్య – కనీస సామర్థ్యాల సాధన – సెప్టెంబర్ 30 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం గురించి – మార్గదర్శకాలు అమలుపర్చడం.

**సందర్భం:** సెక్షన్ 4, ఆర్.టి.ఇ. 2009, ఎస్.సి.ఇ.ఆర్.టి. మరియు ఎన్.సి.ఇ.ఆర్.టి. విద్యార్థుల ప్రగతిపై నిర్వహించిన సర్వేలు.

× × ×

పై విషయం పురస్కరించుకొని జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయునది ఏమనగా, 2015–16 విద్యా సంవత్సరం నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి అధ్యయనాలలో పాఠశాల విద్యలోని పిల్లల స్థాయి ఆశాజనకంగా లేదని వెల్లడైనది. 5వ తరగతి లేదా 8వ తరగతి పిల్లలందరూ కనీసం చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయలేకపోతున్నారు. వాస్తవానికి 3వ తరగతి ప్రారంభంలోనే పిల్లలందరూ చదవడం, రాయడం చేయగలరు. అట్లాగే గణితంలో 3వ తరగతి వరకు కూడిక, తీసివేతలు ప్రాథమిక గణిత సమస్యలు సాధించగలగాలి. 5వ తరగతి పూర్తయ్యే సరికి భాగహారాలు చేయగలగాలి. వీటిని చేయగలిగిన పిల్లలే 6వ తరగతి నుండి వివిధ సబ్జక్టులలోని విషయాలను చదివి అర్థం చేసుకోగలగడం, ఆలోచించి, రాయగలగడం చేయగలగాలి. గణితంలో వివిధ అధ్యాయాలకు చెందిన సమస్యలను అర్థం చేసుకొని సాధించగలగాలి.

ఐతే గత రెండు సంవత్సరాలుగా 3-Rs/ ప్రేరణ, కనీస సామర్థ్యాల సాధన కోసం పలు కార్యక్రమాలను పాఠశాల విద్యలో సర్వ శిక్షా అభియాన్/ ఎస్.సి.ఇ.ఆర్.టి ద్వారా నిర్వహిస్తూనే ఉన్నారు. దురదృష్టవశాత్తు పరిస్థితిలో మార్పులేదు. ఇది పిల్లల అభ్యసనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. దీన్ని అత్యవసరమైన, ముఖ్యమైన కార్యక్రమంగా భావించి 3వ తరగతి నుండి నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. టార్గెట్ అనేది లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఎంత మంది పిల్లలు కనీస సామర్థ్యాలు సాధించారు అనేది చూడడం లేదు.

విద్యా సంస్కరణల అమలు నేపథ్యంలో పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడం మనందరి బాధ్యత. ఈ క్రమంలోనే నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది. అన్ని తరగతులకు కూడా అన్ని సబ్జెక్టులలో విద్యా ప్రమాణాలను నిర్ధారించారు. ఇందుకనుగుణంగా పరీక్షల సంస్కరణలు కూడా సి.సి.ఇ. ద్వారా అమలులోకి వచ్చాయి. ఆర్.టి.ఇ. 2009లోని సెక్షన్ 4 ప్రకారం పిల్లలందరూ వారి వయస్సుకు తగ్గ తరగతిలో కొనసాగుటకు అవసరమైన కనీస సామర్థ్యాలను

సాధించేలా చూడడం కూడా ప్రభుత్వం యొక్క బాధ్యత. ఇందుకోసం కనీస సామర్థ్యాలు సాధించేలా చేయడానికి పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా దృష్టిపెట్టి సాధించాల్సి ఉంది. ఇది విద్యాశాఖలో ఉపాధ్యాయులతో మొదలుకొని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపవిద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు మొదలగు వారందరి బాధ్యత కూడా! కనీస సామర్థ్యాలు ఉంటేనే చెప్పే సిలబస్‌ను పిల్లలు అవగాహన చేసుకుంటారు. వారు సొంతంగా ప్రయత్నించి నేర్చుకుంటారు. కనీస సామర్థ్యాలు లేకుంటే పిల్లలు బడికి వచ్చి తరగతిగదిలో కూర్చున్నా ఎలాంటి ప్రయోజనం పొందరు. కావున ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులందరూ ఆలోచించి నిర్ణయించుకొని కార్యక్రమాన్ని అమలు చేయాలి.

కాబట్టి జూలై 1, 2016 నుండి 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు పిల్లలందరూ కనీస సామర్థ్యాలు అనగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయగలిగేలా ఆయా పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని సెప్టెంబర్ 30 వరకు నిర్వహించాలి.

**కార్యాచరణ ప్రణాళిక :**

- **3వ తరగతి నుండి 8వ తరగతి వరకు పిల్లలందరికి ప్రారంభ పరీక్ష (బేస్‌లైన్ టెస్ట్)ను తెలుగు, ఆంగ్లం, గణితం, సబ్జక్టులలో జూన్ 29, 30 తేదీలలో నిర్వహించాలి. ప్రారంభ పరీక్ష (బేస్‌లైన్ టెస్ట్) కోసం ప్రశ్నాపత్రాలు జతచేయడమైనది. వీటితో ప్రారంభ పరీక్ష నిర్వహించాలి.**
- తెలుగు, ఆంగ్లం సబ్జక్టులలో అక్షరాలు గుర్తించడం, పదాలు, వాక్యాలు, పేరాలు చదవగలగడం, రాయగల్గడం ఎంత మేరకు చేయగలరో పరీక్షించాలి.
- గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారాలలో మామూలు లెక్కలతో పాటు (ఉదా: 15+25) రాత లెక్కలు కూడా ఇచ్చి పరీక్షించాలి.
- ప్రతి దాంట్లో ఐదు అంశాలు ఇవ్వాలి. వాటిలో 4 చేయగలిగితే 'A' అని.. 2 లేదా 3 సరిగ్గా చేస్తే 'B' అని.. 1 చేసినా, అసలే చేయలేకున్నా 'C'గా గుర్తించాలి.
- జవాబు పత్రాలను దిద్దిన తర్వాత పిల్లల స్థాయిని బట్టి మూడు విభాలుగా అంటే ఎ, బి, సి, గా గుర్తించాలి.
- సబ్జెక్టు వారీగా పిల్లల ప్రగతిని గుర్తించి చార్టులో వారి పేర్లను రాయండి.

| విద్యార్థి పేరు | తరగతి | తెలుగు | | | ఆంగ్లం | | | గణితం | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | A | B | C | A | B | C | A | B | C |
| | | | | | | | | | | |

**నిర్వహణ :**

- అన్ని పాఠశాలల్లో అంటే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రతి రోజు అకడమిక్ క్యాలెండర్‌లో తెల్పిన విధంగా 8 పీరియళ్లు ఉంటాయి.

**ప్రాథమిక పాఠశాలలు :**

- ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 4 పీరియళ్లు, మధ్యాహ్నం 4 పీరియళ్లు ఉంటాయి. కాబట్టి ఉదయం ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్క పీరియడ్ చొప్పున అంటే 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, గణితం, మరియు విజ్ఞానశాస్త్రం సబ్జెక్టులకు ఒక్కొక్క పీరియడ్ కేటాయించారు. మధ్యాహ్నం 4 పీరియడ్‌లలో తెలుగు, ఆంగ్లం, గణితంలలో కనీస సామర్థ్యాల సాధనకు ఒక్కొక్క పీరియడ్ చొప్పున 3 పీరియడ్‌లలో 1 పీరియడ్ సహపాఠ్య కార్యక్రమాలు అంటే 'ఆరోగ్య వ్యాయామ విద్య', 'విలువల విద్య–జీవన నైపుణ్యాలు'కు కేటాయించాలి.
- 1,2 తరగతులకు రెగ్యులర్ సిలబస్ అనగా పాఠ్యపుస్తకాల ఆధారంగానే అకడమిక్ క్యాలెండర్‌లో సూచించిన విధంగా బోధనాభ్యసన కార్యక్రమాలు నిర్వహించాలి. 3 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం సబ్జెక్టు వారీగా బోధన, మధ్యాహ్నం కనీస సామర్థ్యాల సాధన కార్యక్రమం నిర్వహించబడాలి.
- మధ్యాహ్నం నిర్వహించే కనీస సామర్థ్యాలను సాధన ఉపాధ్యాయులందరూ బాధ్యతలు స్వీకరించడం. ఒకరికి పూర్తిగా 1, 2 తరగతుల బాధ్యతలు మధ్యాహ్నం పూట కేటాయించాలి. మిగతావారు తరగతుల వారీగా ఉన్న పిల్లల సంఖ్య ఆధారంగా బాధ్యతలు పంచుకొని కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఉదాహరణకు

| | | |
|---|---|---|
| ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలలు : | మొదటి ఉపాధ్యాయుడు | : 1, 2 తరగతులు |
| | రెండవ ఉపాధ్యాయుడు | : 3,4,5 తరగతులు |
| ముగ్గురు ఉపాధ్యాయులున్న పాఠశాలలు : | మొదటి ఉపాధ్యాయుడు | : 1, 2 తరగతులు |
| | రెండవ ఉపాధ్యాయుడు | : 3,4,5 తరగతులలో ఏదైనా ఎక్కువ నమోదు గల ఒక తరగతి |
| | మూడవ ఉపాధ్యాయుడు | : 3,4,5తరగతులు మిగతా రెండు తరగతులు |
| నల్గురు ఉపాధ్యాయులున్న పాఠశాలలు : | మొదటి ఉపాధ్యాయుడు | : 1, 2 తరగతులు |
| | మిగతా వారు | : 3,4,5 తరగతులలో ఒక్కొక్క తరగతి |
| ఐదుగురు ఉపాధ్యాయులున్న పాఠశాలలు : | మొదటి ఉపాధ్యాయుడు | : 1వ తరగతుతి |
| | రెండవ ఉపాధ్యాయుడు | : 2వ తరగతి |
| | మిగతా ముగ్గురు | : 3,4,5 తరగతులలో ఒక్కొక్క తరగతి |

- ప్రాథమిక పాఠశాలల్లో పై విధంగాగాని లేదా ఉపాధ్యాయులందరూ సమావేశమై వారికి అనుకూలమైన రీతిలో బాధ్యతలు పంచుకోవాలి. అనగా ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఒక సబ్జక్టులో 3, 4, 5 తరగతులకు కనీస సామర్థ్యాలు సాధించేలా బాధ్యతలు పంచుకోవచ్చు లేదా 'ఎ' 'బి', 'సి' గ్రూపులలో ఏదైనా ఒక గ్రూపుకు బాధ్యత వహించవచ్చు. ఇదే సమయంలో చదవడం, రాయడం వచ్చిన విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు ఇచ్చి బాగా చదవడం, చదివింది అవగాహన మరియు పుస్తక సమీక్ష చేయించాలి. ఇందుకోసం లైబ్రరీ పుస్తకాలను, ఇతర పుస్తకాలను అందుబాటులో ఉంచుకోవాలి. ఎక్కువ చదివించడం ద్వారానే పిల్లలు ధారాళంగా చదవగలరు, అవగాహన చేసుకోగలరు మరియు రాయగలరు.
- ప్రాథమిక పాఠశాలల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం తెలుగులో 3,4,5 తరగతులలోని తెలుగు పాఠ్యపుస్తకాలలో చిత్రాలతో కూడిన సంసిద్ధతా పాఠాలు వారి ఉన్నాయి. వీటిని సరిగా నిర్వహించడం ద్వారా చదవడం, రాయడం నేర్పించవచ్చు. అట్లాగే గణితంలో 1,2,3 తరగతుల పాఠ్యపుస్తకాలను ఉపయోగించి సాధింప చేయవచ్చు. ఆంగ్లంలో చిత్రాల ఆధారంగా నేర్పించవచ్చు.
- పాఠశాలకు సరఫరా చేసిన స్నేహబాల కార్డులు, ఆర్.బి.సి.లు లేదా (ఆర్.ఎస్.టి.సి) ప్రత్యేక శిక్షణ కేంద్రాలు పిల్లల కోసం రూపొందించిన అభ్యాస పుస్తకాలు కూడా ఉపయోగపడుతవి.
- వర్ణమాల చార్టులు, గుణింతాలు, పదాల చార్టులు, సంఖ్యల చార్టులు, పూసలదండలు, పుల్లల కట్టెలు, రాళ్లు, గోలీలు, ఎక్కాల చార్టులు, వానచినుకులు, కథా వాచకాలు, కథల కార్డులు వంటివి బోధనాభ్యసన సామగ్రిగా ఉపయోగపడుతవి.

**ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలు :**

- 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు కనీస సామర్థ్యాల సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- ఇందుకోసం ప్రతి రోజు మధ్యాహ్నం 3 పీరియళ్లు కేటాయించుకోవాలి. మొదటి పేరు పీరియళ్లలో సబ్జెక్టును అకాడమిక్ క్యాలెండర్‌లో సూచించిన విధంగా పాఠ్యాంశాలు బోధించాలి. తెలుగు, ఆంగ్లం, లెక్కల కోసం ఒక్కొక్క పీరియడ్‌ను కేటాయించుకోవాలి. ఆయా పీరియడ్‌లో వీటికి చెందిన కనీస సామర్థ్యాలను సాధించడానికి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.
- ప్రాథమిక స్థాయిలో సూచించిన విధంగానే పిల్లలను తరగతి వారీగా ప్రారంభ పరీక్షను నిర్వహించాలి. 'ఎ', 'బి', 'సి' లుగా విభజించాలి. తరగతి వారీగా జాబితాను రూపొందించాలి.
- బాగా చేయగల్గిన వారు 'ఎ' గాను, కొన్ని తప్పులు చేసేవారు 'బి' గ్రూపుగాను అసలేమిచేయలేని వారు లేదా ఎక్కువ తప్పులు చేసే వారిని 'సి' గ్రూపులోను తరగతి వారీగా పిల్లల జాబితాను తయారు చేయాలి.
- ఒక తరగతిలోని పిల్లలను మూడు గ్రూపులుగా చేసిన తరువాత బి, సి గ్రూపు పిల్లలపై దృష్టి పెట్టి అభ్యాసం కల్పించాలి ఇందుకోసం 'బి' గ్రూపు పిల్లలను 'ఎ' గ్రూపు పిల్లలను జత చేయాలి. ఐతే 'సి' గ్రూపు పిల్లలకు మాత్రం నేరుగా ఉపాధ్యాయుడే బాధ్యత వహించి కనీస సామర్థ్యాల సాధనకు కృషి చేయాల్సిఉంటుంది. పిల్లల సంఖ్యను బట్టి ఆ తరగతిలోని పిల్లలను గ్రూపుల వారీగా కలుపవచ్చు.
- ఇందుకోసం కేవలం తెలుగు, ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులనే కాకుండా అందరు ఉపాధ్యాయులతో ప్రధానోపాధ్యాయుడు సమావేశం నిర్వహించాలి. మొత్తం మంది ఉపాధ్యాయులకు ప్రతి ఒక్కరికి లేదా ఒక సబ్జెక్టు (తెలుగు/ ఆంగ్లం / గణితం)లో కనీస సామర్థ్యాలు సాధించేలా బాధ్యతలు అప్పగించాలి.

- 2016 ఆగష్టు 15 వరకు ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు అంటే 8 పీరియడ్లలో మధ్యాహ్నం చివరి 3 పీరియడ్లను ఇందుకోసం కేటాయించాలి. కాలనిర్ణయ పట్టికలో వివరాలు పొందుపరచడం. ఆయా పాఠశాలలో ఏ సబ్జెక్టును ఏ తరగతికి ఎవరు తీసుకుంటారో కూడా పొందుపరచాలి.
- కనీస సామర్థ్యాల సాధన కోసం ఉన్నత పాఠశాలల్లో 3వ / 4వ / 5వ తరగతి తెలుగు పుస్తకాలు లేదా ద్వితీయ భాష తెలుగు 8వ తరగతి పుస్తకాన్ని తెలుగు కోసం, 3 లేదా 4వ తరగతి గణిత పుస్తకాలను గణితం కోసం వినియోగించవచ్చు. అట్లాగే ఆంగ్లంలో చిత్రాల ఆధారంగా పదాలు, వాక్యాలు, సంభాషణలు వంటివి చెప్పించడం ద్వారా అభ్యాసం కల్పించవచ్చు. దీనికి 1, 2 తరగతుల్లోని ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలను ఉపయోగించవచ్చు.
- ప్రాథమిక స్థాయికి సూచించిన బోధనాభ్యసన సామగ్రిని ఉన్నత పాఠశాలలకు కూడా వినియోగించవచ్చు.
- తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో సాధించాల్సిన సామర్థ్యాల కోసం సిలబస్ విభజన చేసుకోవాలి. ఉదా: సరళ పదాలు, గుణిత పదాలు, ఒత్తుల పదాలు, వాక్యాలు, పేరాలు ఇలా విభజన చేసుకొని బోధించాలి. సిలబస్ విభజనను ఇలా చేసుకోవచ్చు.

| క్ర.సం. | తెలుగు | ఆంగ్లం | గణితం | నిర్వహించాల్సిన వారం |
|---|---|---|---|---|
| 1 | వర్ణమాల–సరళ పదాలు | Words- Reading Writing | రెండెంకల గుణింతాలు, కూడికలు, తీసివేతలు | జూలై మొదటి వారం<br>జూలై రెండవ వారం |
| 2 | గణిత పదాలు, చదవడం, రాయడం | Words- Reading Writing | మూడెంకల గుణింతాలు, కూడికలు, తీసివేతలు | జూలై మూడవ వారం<br>జూలై నాల్గవ వారం |
| 3 | గణిత పదాలు, చదవడం, రాయడం | Slokalu Reading Writing | గుణకారం... | ఆగస్టు మొదటి వారం<br>ఆగస్టు రెండవ వారం |
| 4 | ఒత్తుల పదాలు, రాయడం | Slokalu Reading Writing | భాగహారం..... లెక్కలు | ఆగస్టు మూడవ వారం<br>ఆగస్టు నాల్గవ వారం |
| 5 | ఒత్తుల పదాలు, వాక్యాలు చదవడం | Paras/ stories Reading Writing | రాత లెక్కలు అభ్యసనం | సెప్టెంబర్ మొదటి వారం<br>సెప్టెంబర్ రెండవ వారం |
| 6 | వాక్యాలు పేరాలు, రాయడం చదవడం | Narration, stories reading writing | రాత లెక్కలు అభ్యసనం | సెప్టెంబర్ మూడవ వారం<br>సెప్టెంబర్ నాల్గవ వారం |

- ప్రతీ వారం నేర్పిన అంశాల ఆధారంగా పిల్లలకు ఉపాధ్యాయులే ఒక పరీక్ష నిర్వహించుకోవాలి. పిల్లల ప్రగతిని పరిశీలించాలి.
- గత సంవత్సరం పరీక్షకు ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన కరదీపిక చదివి వివరాలను సమగ్రంగా పొందుపరచాలి. దీన్ని చదివి కూడా ప్రణాళిక రూపొందించుకోవచ్చు.

**సబ్జక్టులలో కనీస సామర్థ్యాలు:**

- కొంత మంది విద్యార్థులకు కనీస సామర్థ్యాలైన చదవడం, రాయడం వచ్చినప్పటికీ ఆ తరగతికి మరియు ఆ సబ్జక్టుకు సంబంధించిన కనీస సామర్థ్యాలు లేకపోవడం వల్ల ఆ తరగతి సిలబస్‌ను అనుసరించలేకపోతున్నారు. కావున ఆయా సబ్జక్టు టీచర్లు ఆ సబ్జక్టు సిలబస్ అవగాహనకు కావల్సిన కనీస సామర్థ్యాలను గుర్తించి, అవి వచ్చేటట్లుగా ఒక కార్యాచరణను ప్రతి ఉపాధ్యాయుడు తయారు చేసుకొని, దానిని తరగతిగదిలో నిర్వహించాలి. ఇవి చేయడం వల్ల పిల్లలు తమంతట తాము కూడా పాఠ్యాంశాలను చదివి, ఇచ్చిన రాత అంశాలను సొంతంగా చేయగలరు మరియు ప్రయత్నం చేస్తారు. ఇది ప్రతి ఉపాధ్యాయుడు చేయవలసిన కనీస బాధ్యత. పాఠం చెప్పడం అంటే తరగతి సిలబస్ పూర్తి చేయడం కాదు. పిల్లలు ఏ స్థాయిలో ఉన్నారు? అని గమనించి ఆ స్థాయి నుంచి సిలబస్ అవగాహనకు ప్రయత్నం చేయాలి. దీనికి ప్రతి ఒక్కరూ ప్రణాళిక తయారు చేసుకొని అమలుపర్చాలి.

**మూల్యాంకనం:**

- పిల్లల ప్రగతిని ఆగస్టు 17 నాడు మూల్యాంకనం చేసి, ప్రగతిని గుర్తించి నమోదు చేయాలి. బేస్‌లైన్ టెస్ట్‌పై ఎంత శాతం అభివృద్ధి చెందారో గుర్తించి నమోదు చేయాలి.
- పిల్లల ప్రగతిని సెప్టెంబర్ చివరన మూల్యాంకనం చేసి, ప్రగతిని గుర్తించి నమోదు చేయాలి. బేస్‌లైన్ టెస్ట్‌పై ఎంత శాతం అభివృద్ధి చెందారో గుర్తించి నమోదు చేయాలి.
- ప్రధానోపాధ్యాయుడు ప్రతి 15 రోజులకొకసారి కార్యక్రమం అమలుపై ఉపాధ్యాయులతో మాట్లాడి తరగతిగది నిర్వహణను పరిశీలించి, ప్రగతిని గుర్తించాలి. ఈ కార్యక్రమంలో ఉపయోగించే కథల పుస్తకాలు, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలి.
- ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా బాధ్యత తీసుకొని పాల్గొనాలి. ఉపాధ్యాయుని వారీగా పిల్లల ప్రగతిని ప్రధానోపాధ్యాయుడు గుర్తించాలి. నమోదు చేయాలి.

**బాధ్యతలు :**

- పాఠశాల స్థాయిలో కేటాయించిన తరగతి/ పిల్లలకు ఉపాధ్యాయులు బాధ్యత వహిస్తారు.
- మొత్తం పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించాలి.

- అట్లాగే మండలానికి మండల విద్యాధికారి బాధ్యత వహించాలి.
- ఉన్నత పాఠశాలలకు ఉపవిద్యాధికారి వారి పరిధిలోని పాఠశాలలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- జిల్లా విద్యాధికారి 15 రోజులకొకసారి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని పిల్లల ప్రగతి వివరాలను సేకరించి లక్ష్యసాధన జరిగేలా చూడాలి.
- జిల్లాలోని సర్వశిక్షాఅభియాన్‌లోని సెక్టోరల్ అధికారులను కూడా దీంట్లో భాగస్వాములను చేసి డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించాలి.
- జిల్లాలోని పాఠ్యపుస్తక రచయితలు, స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు, రాష్ట్ర / జిల్లా / స్థాయిల్లో శిక్షణలు ఇచ్చిన వారిని, డైట్ ఉపన్యాసకులకు మాడ్యుల్స్ రూపొందించిన వారి దీంట్లో భాగస్వాములను చేసి వారి సేవలను కూడా వినియోగించుకోవాలి.
- తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో జిల్లా స్థాయిలో ఒక విషయ నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసుకొని వీరితో డివిజన్ల వారీగా శిక్షణ నిర్వహించాలి. వారినా ఆయా డివిజన్లు/ మండలంలోని ఉపాధ్యాయులకు సహాయమందించేలా ప్రణాళిక రూపొందించి, లక్ష్య సాధన కోసం కృషి చేయాలి.
- రాష్ట్ర స్థాయి అధికారులు మరియు మానిటరింగ్ బృందాలు ప్రతి నెలలో జిల్లాలోని పాఠశాలలను సందర్శించి కార్యక్రమ అమలును మరియు ప్రగతిని పరిశీలించి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు నివేదికలు సమర్పిస్తారు.

సమస్త జిల్లా విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన కార్యక్రమంగా నిర్వహించి భావించి సెప్టెంబర్ 30 వరకు పిల్లలందరూ చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయగలిగేలా బాధ్యత వహించగలరని కోరనైనది.

ఈ కార్యక్రమం అమలుపై ప్రాంతీయ విద్యా సంచాలకులు పాఠశాలలను సందర్శించి కార్యక్రమంపై జిల్లా విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించాలి. తాను సందర్శించిన పాఠశాలలపై మరియు సమీక్షపై నివేదికను పాఠశాల సంచాలకులకు సమర్పించాలి.

28/6/2016

సంచాలకులు

**పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ**

దీని ప్రతులు

శ్రీయుత ప్రాంతీయ విద్యా సంచాలకులు, తెలంగాణ రాష్ట్రం.

శ్రీయుత జిల్లా విద్యాధికారులు, తెలంగాణ రాష్ట్రం

శ్రీయుత జిల్లా ప్రాజెక్టు అధికారులు, సర్వ శిక్షా అభియాన్, తెలంగాణ రాష్ట్రం గారలకు తగు చర్యల నిమిత్తం.

శ్రీయుత ప్రధానోపాధ్యాయులకు (అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జిల్లా విద్యాధికారి ద్వారా)